
సాక్షి రంగారెడ్డి

శుక్రవారం : 23 : ఫిబ్రవరి : 2024



పచ్చ తోరణం

యాచారం మండలంలోని ఆయా గ్రామాల్లో పచ్చని చెట్లు స్వాగత తోరణాలుగా కనువిందు చేస్తున్నాయి. 8లో▸



చోరీల కలకలం

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంట తండాలో బుధవారం అర్ధరాత్రి మూడు ఇళ్లలో చోరీ జరిగింది. 8లో▸



ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

ఇబ్రహీంపట్నంను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు కబడ్డీ ఎంపిక పోటీలు

హుడాకాంప్లెక్స్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం కబడ్డీ గ్రౌండ్‌లో శుక్రవారం సీనియర్ పురుషుల జిల్లా జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రవికుమార్ తెలిపారు. స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించే 70వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని చెప్పారు. జిల్లా సీనియర్ కబడ్డీ ఎంపిక పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు పురుషులు 85 కేజీల లోపువారికే అర్హత ఉంటుందన్నారు. అభ్యర్థులు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని అన్నారు. వివరాలకు 76619 92581, 90000 38272 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మీర్‌పేట మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం



కలెక్టర్ శశాంకకు అవిశ్వాస నోటీసు అందజేస్తున్న కార్పొరేటర్లు

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసానికి సంబంధించి గురువారం మూడు పార్టీలకు చెందిన కార్పొరేటర్లు కలెక్టర్ శశాంకను కలిసి నోటీసు అందజేశారు. కలెక్టర్‌కు నోటీసు అందజేసిన వారిలో బీజేపీ నుంచి 14, టీఆర్ఎస్ నుంచి 9, కాంగ్రెస్ నుంచి 8 మంది, మొత్తం 31 మంది కార్పొరేటర్లు ఉన్నారు. నోటీసు అందిన 15 నుంచి 30 రోజుల్లో సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా లేదా అనేది వేచి చూడాల్సిందే. ఇప్పటికే అవిశ్వాస నోటీసులో సంతకాలు పెట్టిన కొందరు కార్పొరేటర్లు క్యాంపులకు వెళ్లినట్లు తెలుస్తోంది.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత




కస్తూర్బాగాంధీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కందుకూరు: బాలల పరిరక్షణ అందరి బాధ్యత అని బాల రక్షభవన్ జిల్లా కోఆర్డినేటర్ హర్షవర్ధిని అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో గురువారం బాలల హక్కులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలలను చదువుకు దూరం చేసి కార్మికులుగా మార్చితే చర్యలు తప్పవన్నారు. బాలల అక్రమ రవాణా, అక్రమ దత్తత, లింగ వివక్ష, చదువుపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మహిళా సాధికారత, మహిళలు, బాలికలకు ఎదురయ్యే సమస్యలు, ఎలా ఎదుర్కోవాలి తదితర సమస్యలపై మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మంజుల అవగాహన కల్పించారు. పిల్లల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ శేఖర్ వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సబిత, మంజుల పాల్గొన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు

- రుజువు చేస్తే దేనికైనా సిద్ధం
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రతి సవాల్



ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: సేవ చేయడానికే రాజకీయల్లోకి వచ్చాను కానీ డబ్బులు సంపాదించడానికి కాదని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో గురువారం విజయ సంకల్పయాత్ర సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలను ఖండించారు. ఆరోపణలు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమే నని ప్రతి సవాల్ విసిరారు. తనపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమైనవని, ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ ఆరోపణలు చేయడం దారుణమని పేర్కొన్నారు. ఏదైనా మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. ఆయన ఆరోపించినట్లు సీతారాంపూర్ భూముల వ్యవహారంలో తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఓట్ల రాజకీయం కోసం అవాస్తవ ఆరోపణలు చేయటం సిగ్గుచేటన్నారు.

పుతిన్ ప్రైవేట్ ఆర్మీలో తెలంగాణ వాసులు

ఉద్యోగాల ఆశజూపి మహమద్ అస్ఫాన్ సహా 12 మందిని రష్యా తరలించిన ఏజెంట్లు



- అక్కడకు వెళ్లాక పుతిన్ సైన్యంలో చేర్చిన అధికారులు
- ఉక్రెయిన్‌పై యుద్ధంలో వారిని వినియోగిస్తున్న రష్యా
- వెనక్కి రప్పించాలంటూ కుటుంబీకుల ఆవేదన
- స్పందించిన ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ
- ఈ అంశంపై మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి లేఖ

సాక్షి, సిటీబ్యూరో: రష్యాలో సెక్యూరిటీ గార్డు, హెల్పర్ ఉద్యోగాలు ఇప్పిస్తామన్న బ్రోకర్ల వలకు చిక్కి 12 మంది భారతీయ యువకులు ప్రస్తుతం ప్రాణభయంతో విలవిల్లాడుతున్నారు. ఉక్రెయిన్‌పై పోరులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్‌కు చెందిన ప్రైవేటు సైన్యం 'ది వాగ్నర్' గ్రూప్‌లో బలవంతంగా పనికి కుదర్చడంతో వారంతా బాంబులు, తుపాకుల మోత మధ్య బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్నారు. తమను వీలైనంత త్వరగా తిరిగి తీసుకెళ్లాలని తమ కుటుంబీకులకు ఆడియో, వీడియో సందేశాలు పంపుతున్నారు. ఈ బాధితుల్లో హైదరాబాద్‌లోని బజార్‌ఘాట్‌కు చెందిన మహమద్ అస్ఫాన్, నారాయణ్‌పేట జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ మహ్మద్ సుఫియన్ ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది.

నమ్మించి మోసం..

బాబా బ్లాగ్స్ పేరుతో యూట్యూబ్ చానల్ నిర్వహించే ఫైసల్ ఖాన్ అలియాస్ బాబా ప్రస్తుతం షార్జాలో ఉంటున్నాడు. దాదాపు 50 వేల మంది ఫాలోవర్లు ఉన్న తన బ్లాగ్ ద్వారానే రష్యాలో సెక్యూరిటీ గార్డు, హెల్పర్ ఉద్యోగాలు ఉన్నాయంటూ ఎర వేశాడు. దీనికి ఆకర్షితుడైన బజార్‌ఘాట్ ప్రాంతానికి చెందిన మహమద్ అస్ఫాన్ (30) మొదట బాబాను సంప్రదించాడు. ఏడాది కాలం కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేలా రష్యాలో ఉద్యోగాలు ఉన్నాయని నమ్మబలికాడు.



అస్ఫాన్ (బాధితుడు)



ఏజెంట్లు బాబా, మోయిన్

అతన్నుంచి రూ.3 లక్షలు వసూలు చేసి ఉద్యోగం ఖరారు చేస్తానంటూ నమ్మబలికాడు. మాస్కోలోని తన సబ్ ఏజెంట్లు సుఫాయాన్, మోయిన్, రమేష్‌లను సంప్రదించాలని సూచించాడు. దీంతో గతేడాది నవంబర్ 12న అస్ఫాన్ చెన్నై విమానాశ్రయం నుంచి షార్జా మీదుగా రష్యా చేరుకున్నాడు. ఈ ప్రయాణం కోసం విజిట్ వీసా ఏర్పాటు చేసిన బాబా.. జాబ్ వీసాను మోయిన్ ఇస్తాడని నమ్మించాడు. అక్కడకు వెళ్లిన అతన్ని రిసీవ్ చేసుకున్న రమేష్ సెక్యూరిటీ ఉద్యోగం అని చెప్పి తీసుకువెళ్లాడు.

సంతకాలు తీసుకొని..

మాస్కోలోని ఒక మాల్‌లో పని చేయాలంటూ రష్యన్ భాషలో రాసి ఉన్న పత్రంపై అస్ఫాన్‌తో రమేష్ సంతకాలు చేయించాడు. రమేష్, మోయిన్‌లు అస్ఫాన్ సహా 12 మంది భారతీయులను ఆ సమీపంలోని సైనిక శిబిరానికి తీసుకెళ్లి తుపాకులు వినియోగించడంలో ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. సెక్యూరిటీ గార్డు విధుల్లో భాగంగానే ఇది ఇస్తున్నట్లు నమ్మించారు. ఆపై వారిని దాదాపు వెయ్యి కి.మీ. దూరంలోని ఉక్రెయిన్ సరిహద్దుల్లోకి చేర్చారు. దీంతో తాను సంతకం చేసింది పుతిన్‌కు చెందిన ప్రైవేట్ ఆర్మీ ది వాగ్నర్ గ్రూప్‌లో ఏడాది పాటు పని చేసేందుకని అస్ఫాన్ ఆలస్యంగా గుర్తించాడు. ఆజాద్ యూసుఫ్ అనే భారతీయుడు తమ కళ్లెదుటే అశువులు బాయడంతో మిగిలిన వారంతా ఆందోళన చెందారు. అనంతరం వారిని అక్కడ నుంచి ఉక్రెయిన్‌లోని వేర్వేరు ప్రాంతాలకు తరలించారు.

రూ. లక్ష జీతమంటూ సుఫియన్‌ను మోసగించి...

నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన డ్రైవర్ జహీర్, నాసీమా రెండో కుమారుడు సయ్యద్ మహ్మద్ సుఫియన్ ఇంటర్ వరకు చదువుకొని 2021లో జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లి హోటల్‌లో పనిచేస్తున్నాడు. అక్కడే అతనికి బాబా పరిచయమయ్యాడు. దుబాయ్‌లో పనిచేస్తే రూ.30 వేలే వస్తాయ్..అదే రష్యాలో హెల్పర్‌గా పనిచేస్తే రూ.లక్ష వరకు జీతం వస్తుందని నమ్మించాడు. ఇందుకుగాను తనకు రూ.3 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. అందుకు సుఫియన్ అంగీకరించడంతో తల్లిదండ్రులు అప్పు చేసి ఆ డబ్బు కుమారుడికి ఇచ్చారు. డిసెంబర్ 17న దుబాయ్‌కు అక్కడి నుంచి 18న రష్యాకు సుఫియాన్ వెళ్లాడు.

రక్షించాలంటూ సందేశాలు..

అస్ఫాన్ గతేడాది డిసెంబర్ 13 వరకు కుటుంబీకులతో సంప్రదింపులు జరిపినా ఆపై సిగ్నల్స్ దొరకలేదు. మిగిలిన 11 మందికీ సరైన సిగ్నల్స్ లభించక కుటుంబీకులకు ఆడియో, వీడియో సందేశాలు పంపారు. వాటిలోనే తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ రికార్డుల్లో బాంబుల మోతలు, తుపాకీ కాల్పులు వినిపిస్తున్నట్లు కుటుంబీకులు చెబుతున్నారు. అస్ఫాన్ సోదరుడు ఇమ్రాన్ 'సాక్షి'తో మాట్లాడుతూ 'అస్ఫాన్‌కు భార్య, కుమార్తె (2), కుమారుడు (8 నెలలు) ఉన్నారు. ఉక్రెయిన్‌లోని యుద్ధ క్షేత్రంలో ఉన్న అతడిని ఇక్కడకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అస్ఫాన్ ఇటీవల పంపిన సందేశంలో వారి చుట్టూ ఉన్న వాళ్లు యుద్ధంలో మరణిస్తున్నారని చెప్పాడు. నన్ను వెనక్కు తీసుకురావడానికి ఏదైనా చేయాడంటూ వేడుకున్నాడు' అని పేర్కొన్నాడు. బాధిత కుటుంబాల కోరిక మేరకు స్పందించిన ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ అంశంపై మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి లేఖ రాశారు.



శేరిగూడలోని కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణులతో పీఏసీఎస్ డైరెక్టర్లు

కోర్టు స్టేతో ఆగిన అవిశ్వాసం

- ఉప్పరిగూడ పీఏసీఎస్‌పై నోటీసులిచ్చిన సభ్యులంతా హాజరు
- న్యాయస్థానం స్టే విధించడంతో వివరాలు వెల్లడించని అధికారులు

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్‌పై అవిశ్వాస నోటీసులిచ్చిన డైరెక్టర్లంతా గురువారం సమావేశానికి హాజరయ్యారు. శేరిగూడలోని పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా డీసీఓ ధాత్రిదేవి వ్యవహరించారు. చైర్మన్, వైస్ చైర్మన్ కార్యాలయానికి వెళ్లినా అవిశ్వాస సమావేశ ప్రక్రియకు హాజరుకాకుండా వారి చాంబర్‌లోనే కూర్చున్నారు. తనపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస ప్రక్రియ సరైన పద్ధతిలో లేదని పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కొన్ని కండిషన్లతో అవిశ్వాస ప్రక్రియపై న్యాయస్థానం స్టే విధించింది. దీంతో ప్రిసైడింగ్ అధికారి, డైరెక్టర్లు సమావేశ వివరాలను గోప్యంగా ఉంచారు. కార్యాలయ సీఈఓ గణేశ్‌ను సమావేశానికి అనుమతించలేదు. అవిశ్వాస నోటీసులు అందజేసిన 11 మంది డైరెక్టర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశ నివేదికను అధికారులు వచ్చే నెల 7న న్యాయస్థానం ఎదుట పెట్టనున్నారు.

చైర్మన్‌గా సుదర్శన్‌రెడ్డి కొనసాగింపు

చైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా క్యామ శంకర్ న్యాయస్థానం స్టే తొలగించి తీర్పు వెలువరించేంత వరకు పదవుల్లో కొనసాగనున్నారు. వచ్చే నెల 7న దీనిపై న్యాయస్థానంలో తీర్పు వెలువడే అవకాశం ఉంది.

సులువుగా నెగ్గుతామనుకుంటే..

సులువుగా నెగ్గుతామని ధీమాతో ఉన్న కాంగ్రెస్ శ్రేణులకు కోర్టు స్టేతో చుక్కెదురైంది. పీఏసీఎస్ చైర్మన్ పదవిని ఆశించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, డైరెక్టర్లు సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చి విజయ సంకేతం చూపడం కొసమెరుపు.

ఏది చేసినా నిబంధనల మేరకే..

ఎమ్మెల్యే సబితారెడ్డి



బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలను రెసిడెన్షియల్ జోన్లుగా మార్చేందు కు అంతా చట్ట ప్రకారమే పనిచేసినట్లు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన 'ఓట్ల కోసం ఫేక్ జీఓ' కథనంపై స్పందించారు. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే రెసిడెన్షియల్ జోన్‌గా మార్చడానికి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. చిన్న పాటి సాంకేతిక సమస్యతో జీఓ ఆలస్యం కావడం.. కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియ ఆగిపోయిందన్నారు. నోటిఫికేషన్ మాత్రమే ప్రజలకు చెప్పామని.. ఇందులో తమ నేతలెవరూ అబద్ధాలు చెప్పలేదని తెలిపారు. ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదని స్పష్టం చేశారు. ప్రజల కోసం పనిచేస్తామని.. తమపై నమ్మకం ఉంచి గెలిపించిన వారికి న్యాయం చేస్తామని తెలిపారు. ఆయా కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఓపెన్, గ్రీన్ జోన్ల సమస్యలు ప్రస్తుత ముఖ్యమంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు ఆయా కాలనీవాసుల వెంటే ఉంటామని హామీ ఇచ్చారు.

కేంద్రంలో బీజేపీకి పట్టం ఖాయం

- తెలంగాణలో అన్ని లోక్‌సభ స్థానాలు గెలుస్తాం
- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్



షాబాద్ మండలం నాగరగూడలో పార్టీ శ్రేణుల బైక్ ర్యాలీ

చేవెళ్ల/మహేశ్వరం: కేంద్రంలో నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై మరోసారి బీజేపీకి పట్టం కట్టడం ఖాయమని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. విజయసంకల్ప యాత్రలో భాగంగా గురువారం మండల పరిధిలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలన్నీ భారత్‌వైపు చూస్తున్నాయని.. దీనికి మోదీ పాలనా విధానాలే కారణమని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శాసనసభ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీతారాంపూర్ పరిధిలోని అసైన్డ్, దేవాలయ భూములను అప్పటి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టిందని ఆరోపించారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు మోదీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచా రం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, నాయకులు రాము, సురేశ్, కూతురు మహేందర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి మోదీనే..

బీజేపీ కేంద్రంలో 400 ఎంపీ స్థానాలను గెలుపొంది మూడోసారి మోదీ ప్రధాని కాబోతున్నారని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం మహేశ్వరం చేరుకున్న విజయ సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలుపును గాలివాటంగా అభివర్ణించారు. బీఆర్ఎస్ పార్టీపై ఉన్న వ్యతిరేకతతో గెలిచిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో ఫార్మాసిటీ పేరుతో పేదల భూములను లాక్కోవడంతో పాటు దేవుడి భూములు, మాన్యాలను వదలకుండా బలవంతంగా తీసుకుందని ఆరోపించారు. త్వరలో లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే అని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బి. పాపయ్య గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

సాక్షి,రంగారెడ్డి జిల్లా: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై పూర్తి వివరాలు సేకరించి సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. మిషన్ భగిరథ నీటి ట్యాంకుల్లో నీటి సరఫరా పైపులైన్ లీకేజీల వంటివి గుర్తించాలన్నారు. అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి పని చేయని బోర్లు, పంపుసెట్లను గుర్తించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వచ్చే మూడు నెలలు అత్యంత కీలకమైనవని, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఏఈలు ప్రతి రోజూ క్షేత్ర స్థాయిలో ఉండాలని, డీఈలు సంబంధిత మండలంలో ఉండాలన్నారు. వేసవిలో పని చేసే ఉపాధి హామీ కూలీలకు పని చేసే ప్రాంతాల్లో తాగునీరు, మెడికల్ కిట్ వంటివి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఆర్డీఏ పీడీని ఆదేశించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ శ్రీలత, అడిషనల్ పీడీ సుభాషిణి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఇరిగేషన్ అధికారులు, ఎంపీడీఓలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లే..

- బీఆర్ఎస్ హయాంలో అవినీతి పాలన
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి
- దేశంలో మచ్చలేని మోదీ సర్కార్
- బీజేపీ శాసనసభ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం అంతమైందనుకుంటే.. కొత్తగా వచ్చిన ప్రభుత్వంతో పెనం మీదనుంచి పొయిలో పడినట్లు పరిస్థితి తయారైందని బీజేపీ శాసనసభ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం కందవాడలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో పదేళ్లలో మోదీ మచ్చలేని పాలన సాగించారని.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. యూపీఏ హయాంలో అంతా అవినీతిమయంగా మారిందని.. మోదీ వచ్చిన తరువాత దేశం అభివృద్ధి దిశలో పయనిస్తోందని పేర్కొన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కేటీఆర్ బినామీగా మారి పేదల నుంచి వందల ఎకరాలు తక్కువ ధరకు తీసుకొని పరిశ్రమలకు అప్పగించి కోట్లు గడించాడని ఆరోపించారు. ఆయన చేసిన అవినీతి అక్రమాలను ఆధారాలతో నిరూపిస్తానని.. చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడోసారి కూడా మోదీయే ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ అంటేనే కన్ఫ్యూజ్ అని.. ఆ పార్టీతో ఒరిగేదేమీ లేదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అత్యధిక ఎంపీ సీట్లు గెలవాలనే లక్ష్యంతోనే విజయ సంకల్ప యాత్ర జరుగుతోందని, రేపటి వరకు జిల్లాలో ఈ యాత్ర కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మల్లారెడ్డి, జంగారెడ్డి, పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణగౌడ్, వెంకట్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాక్సిడెంట్ చేసి తప్పించుకు తిరుగుతున్న..

నిందితుడిని గుర్తించిన పోలీసులు

తలకొండపల్లి: యాక్సిడెంట్ చేసి తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీన మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కొండేడ్‌కి చెందిన మహేశ్ బైక్‌పై కడ్తాల్ వైపు వెళ్తుండగా మార్గ మధ్యలో తుమ్మలకుంట తండా సమీపంలో గుర్తుతెలియని వాహనం అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్ బైక్‌పై నుంచి కింద పడటంతో అతడి కుడి కాలు విరిగింది. కాగా యాక్సిడెంట్ చేసిన వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు మహేశ్‌ను 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ శివరాం ఆస్పత్రికి తరలించారు. మహేష్ తండ్రి జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన పూలదండి హరీష్‌గా గుర్తించారు. త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. ప్రస్తుతం బాధితుడు మహేష్ కోలుకుంటున్నారని తెలిపారు.

రహదారులకు పచ్చ తోరణం

సత్ఫలితాలిస్తోన్న పల్లె ప్రగతి

- యాచారంలో కనువిందు చేస్తున్న పచ్చని చెట్లు
- సేదతీరుతున్న వాహనదారులు, స్థానికులు



చింతుల్ల వెళ్లే రోడ్డులో పచ్చటి తోరణంలా పెరిగిన చెట్లు

యాచారం: గ్రామాలోంని పచ్చని చెట్లు స్వాగత తోరణాలుగా కనువిందు చేస్తున్నాయి. యాచారం మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా పచ్చని చెట్లు దర్శనమిస్తుండటం ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. నాటి ఎంపీడీఓ వినయ్‌కుమార్ పట్టుదల, శ్రమ, కృషి ఫలితమే నేడు గ్రామాల్లోని రహదారులన్నీ పచ్చని తోరణాలుగా కనిపిస్తున్నాయి. పర్యావరణ, పరిరక్షణ కోసం గత బీఆర్ఎస్ సర్కార్ పల్లె ప్రగతిలో భాగంగా హరితహారం ద్వారా చెట్లు నాటే కార్యక్రమాన్ని చాలెంజ్‌గా తీసుకుంది. అందులో భాగంగానే 4వ విడత పల్లె ప్రగతి పథకంలో యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో దాదాపు 3 లక్షలకు పైగా మొక్కలు నాటారు. ప్రతి గ్రామానికి 10వేల నుంచి 15వేలకు తగ్గకుండా పలు రకాల మొక్కలు నాటారు. ఇందులో గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు అందరినీ భాగస్వాములు చేశారు.

కడియం నుంచి మొక్కలు

పల్లె ప్రగతిలో భాగంగా రహదారుల వెంట నాటిన మొక్కలకు సంబంధించి పంచాయతీలకు ట్రీగార్డు ఖర్చు లేకుండా మేకలు, పశువుల నుంచి రక్షణ ఉండటం కోసం నాటి ఎంపీడీఓ వినయ్‌కుమార్ కడియం నుంచి 12 నుంచి 14 అడుగుల ఎత్తున్న పలు రకాల మొక్కలు తెప్పించి పంచాయతీలకు సరఫరా చేశారు. ఆ మొక్కలు నేడు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో చెట్లుగా ఎదిగి పచ్చని తోరణాలుగా కనువిందు చేస్తున్నాయి. రోడ్డు మధ్యలోని డివైడర్‌లో కాకుండా రోడ్డుకిరువైపులా నాటడంతో అవి ఏపుగా పెరిగి రోడ్డుకిరువైపులా నీడను ఇస్తున్నాయి. దుకాణాల వద్ద, ఇండ్ల వద్ద నాటిన మొక్కలు నేడు చిరువ్యాపారులకు, దుకాణ యజమానులకు చల్లని నీడను ఇస్తున్నాయి. చెట్ల కిందనే చిరు వ్యాపారులు పలు రకాలు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ఉన్న యాచారం, మాల్ కేంద్రాల్లో డివైడర్ మధ్యలో నాటిన మొక్కలు రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఎంతో కనివిందు చేస్తున్నాయి.

24 గ్రామ పంచాయతీల్లో..

4వ విడతలోనే పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని నాటి కేసీఆర్ సర్కార్ భావించింది. ఇందులో భాగంగా గ్రామాల్లోని ప్రభుత్వ, వెంచర్లల్లో ఎంపిక చేసిన ఖాళీ స్థలాల్లో ఒకేచోట 500 నుంచి వెయ్యి మొక్కలు నాటారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలతో పాటు మరో నాలుగు అనుబంధ గ్రామాల్లో కూడా పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. నాడు నాటిన మొక్కలు ఇప్పుడు చెట్ల రూపంలో దర్శనమిస్తున్నాయి. వాటిలో పలు రకాల పండ్ల మొక్కలు కూడా ఉండటంతో అవి పంచాయతీలకు ఆదాయాన్ని కూడా ఇస్తున్నాయి. పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కల సంరక్షణలో కూడ పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగింది. రహదారుల్లోనే కాకుండా గ్రామాల్లో, కాలనీల్లోని రోడ్డు వెంట నాటిన మొక్కలు నేడు చెట్లుగా ఎదిగి గ్రామాల్లో ప్రజలకు చల్లటి నీడను ఇస్తున్నాయి.

సంరక్షణపై నిర్లక్ష్యం వద్దు



మొక్కల సంరక్షణపై పంచాయతీలు నిర్లక్ష్యం చేయొద్దు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో వారానికో మారు చెట్లకు నీళ్లు పోస్తేనే జీవిస్తాయి. ఏ గ్రామానికి వెళ్లినా పచ్చని చెట్లు కనివిందు చేస్తున్నాయి. సంరక్షణ చేస్తే భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణతో పాటు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

25 నుంచి జిల్లాస్థాయి క్రీడా పోటీలు



స్టేడియంను పరిశీలిస్తున్న అవినాష్‌రెడ్డి

చేవెళ్ల: ఈనెల 25వ తేదీ నుంచి షాబాద్‌లో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ అవినాష్‌రెడ్డి తెలిపారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో పార్టీ శ్రేణులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్ మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, వాలీబాల్ మొదటి బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, నిర్వాహకులు మహేష్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మంగళి సత్యం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు 98497 11579, 99490 86569 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పెంటతండాలో చోరీల కలకలం

- ఒకేరోజు మూడు ఇళ్లలో బంగారం, నగదు అపహరణ
- భయాందోళనలో ప్రజలు



చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ బల్‌రాం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండాలో బుధవారం అర్ధరాత్రి మూడు ఇళ్లలో చోరీ జరిగింది. ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాం తెలిపిన వివరాల ప్రకారం.. పెంటతండాకు చెందిన ఇస్లావత్ సునీత భర్త రఘురాం బుధవారం పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లడంతో సాయంత్రం భోజనం చేసిన సునీత కుటుంబ సభ్యులతో కలిసి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో నిద్రించింది. ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఇంటిలోపల బీరువాలో ఉన్న 9 గ్రాముల బంగారు నగలు, 20 తులాల వెండి గొలుసు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. అలాగే తండాకు చెందిన జటావత్ మల్యా, ఇస్లావత్ మల్యాల ఇంటి తాళాలను పగులకొట్టిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించుకుపోయారు. సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పెంటతండాలో చోరీకి గురైన ఇళ్లను ఎస్‌ఐ బాల్‌రాం గురువారం పరిశీలించి వివరాలు సేకరించారు. ఇటీవలే కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండాలో ఒకేరోజు రాత్రి ఐదు ఇళ్లలో దొంగతనం జరిగిన విషయం మరవకముందే తాజాగా పెంటతండాలో అదే తరహాలో దొంగతనం జరిగింది.

బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ నిహాద్ అహ్మద్



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం : వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నిహాద్ అహ్మద్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌ఖాన్ ఆధ్వర్యంలో గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని సాహెబ్‌గూడలో ఉచిత రక్త పరీక్షలు, హెల్త్ క్యాంపు నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ నిహాద్ అహ్మద్ మాట్లాడుతూ.. నిత్యం బలమైన ఆహారం తీసుకోవాలని కోరారు. పీహెచ్‌సీల్లో చిన్నారులకు విటమిన్–ఏ మందులు అందజేస్తున్నామన్నారు. త్వరలోనే పల్స్ పోలియో టీకాలు వేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూత్ యువసేన మహిళా అధ్యక్షురాలు రామేశ్వరి, ముస్లిం మహిళా అధ్యక్షురాలు ఫైమీదా, జరీనా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శీలం నవీన్, బీసీసెల్ అధ్యక్షురాలు కవిత, తదితరులు పాల్గొన్నారు.

అడవి పందిని ఢీకొట్టి..

- ఆటో బోల్తా, ఒకరి దుర్మరణం
- చేవెళ్ల మండలం ఊరేళ్ల రోడ్డు సమీపంలో ఘటన



ప్రమాద స్థలంలో లక్ష్మి మృతదేహం

చేవెళ్ల: సంతకు వచ్చి గ్రామానికి వెళ్తున్నవారి ఆటోను అడవిపంది ఢీకొట్టగా ఆటో బోల్తాపడి ఓ మహిళ మృతి చెందగా ఆటో డ్రైవర్ సహా మరో ముగ్గురికి తీవ్రగాయలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని రామన్నగూడకి చెందిన లక్ష్మి(60), పి.విఠలయ్య, జహంగీర్, ఖాజామియా చేవెళ్లలో ప్రతి గురువారం జరిగే కూరగాయల సంతకు వచ్చి కూరగాయలు తీసుకొని గ్రామానికి చెందిన మల్లేశ్ ఆటోలో గ్రామానికి రాత్రి తిరిగి వెళ్తున్నారు. ఆటో ఊరేళ్ల రోడ్డు మీదుగా కొద్దిదూరం ఇబ్రహీంపల్లి వాగుకు సమీపంలోకి రాగానే ఓ అడవిపంది ఆటోను ఢీకొట్టడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న లక్ష్మి అక్కడికక్కడే దుర్మరణం చెందగా విఠలయ్య, జహంగీర్, ఖాజామీయాకు తీవ్ర గాయలయ్యాయి. డ్రైవర్ మల్లేశ్‌కు స్వల్ప గాయలయ్యాయి. స్థానికులు అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తలరించారు. పోలీసులు సంఘటనా స్థలంలో వివరాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొయినాబాద్: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ ఆజాద్(34) బతుకుదెరువు కోసం మొయినాబాద్‌కు వలస వచ్చాడు. ఈనెల 16న ఉదయం 9:30 గంటల సమయంలో మండల పరిధిలోని గండిపేట చౌరస్తా సమీపంలోని మెలోహా స్కూల్ వద్ద ఆజాద్ రోడ్డు దాటుతుండగా ఓ బైక్ అతడిని వేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతన్ని స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

ప్రభుత్వ ఉపాధ్యాయుడి దుర్మరణం



కృష్ణ(ఫైల్)

షాద్‌నగర్: విధులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించిన విషాదకర ఘటన షాద్‌నగర్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రానికి చెందిన నీరటి కృష్ణ(47) ప్రభుత్వ ఉపాయుధ్యాడిగా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా గండిపేట మండలం కిస్మత్‌పూర్‌లో కుటుంబంతో నివాసం ఉంటూ జిల్లేడ్‌చౌదరిగూడ మండల పరిధిలోని గాలిగూడెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే హైదరాబాద్‌లోని బడంగ్‌పేట్‌లో నివాసం ఉంటున్న సత్యనారాయణరెడ్డి జిల్లేడ్ పభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. సత్యనారాయణరెడ్డి ప్రతిరోజు.. కిస్మత్‌పూర్‌లో నివాసం ఉంటున్న కృష్ణతో కలిసి బస్సులో షాద్‌నగర్‌కు వచ్చి అక్కడి నుంచి బస్సులో పాఠశాలకు వెళ్లేవాడు. అయితే సమ్మక్క సారక్క జాతర నేపథ్యంలో గ్రామాలకు బస్సు సర్వీసులు తక్కువగా ఉండటంతో గురువారం విధులు ముగించుకున్న కృష్ణ, సత్యనారాయణరెడ్డి పాఠశాల నుంచి బైక్‌పై షాద్‌నగర్‌కు బయలుదేరారు. బస్టాండ్ ఎదురుగా పరిగి రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో నేను బస్సులో సీటు పెడతాను మీరు బైక్‌ను బస్టాండ్‌లో పెట్టి రండి అని సత్యనారాయణరెడ్డి కృష్ణను కోరాడు. దీంతో కృష్ణ బైక్‌ను బస్టాండ్‌లో పెట్టేందుకు వెళ్తుండగా వెనుకనుంచి అతివేగంగా వచ్చిన లారీ కృష్ణ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన కృష్ణను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కృష్ణ మరణ వార్తను తెలుసుకున్న ఉపాధ్యాయులు, బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- రూ.13కోట్లతో 2024–25 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని.. ఇందుకు తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి చందు అధ్యక్షతన గురువారం జరిగిన 2024–25 బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని, వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యను తీర్చడంతో పాటు, లైటింగ్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. పేదలపై భారం వేయకుండా మున్సిపాలిటీ అభివృద్ధికి ఆదాయ వనరులను పెంచుకునే మార్గాలను అన్వేషించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధిని పరుగులు పెట్టించాలన్నారు. సాగర్ ప్రధాన రహదారిపై నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసేలా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

రూ.13 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం..

2024–25 ఏడాదికి సంబంధించి రూ.13,10,70,000 వార్షిక బడ్జెట్ కౌన్సిల్ ఆమోదించింది. అంచనా వ్యయం రూ.13,10,64,000గా సమావేశంలో తీర్మానం చేశారు. వివిధ పద్దుల కింద రాబడులు తగ్గడంతో గత సంవత్సరం రూ.18 కోట్లకు పైగా ఉన్న బడ్జెట్‌ను ఈసారి రూ.5 కోట్ల మేర తగ్గించడం కొసమెరుపు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరితోపాటు ఈ సమావేశానికి దాదాపు 14 ప్రభుత్వ శాఖల నుంచి అధికారులు హాజరయ్యారు. చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన అనంతరం జరిగిన తొలి సమావేశం ప్రశాంతంగా ముగియడం విశేషం.

‘ఉపాధి’ పనుల్లో అలసత్వం వద్దు



మంచాలలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

మంచాల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిబంధనల ప్రకారం గ్రామాల్లో పనులు కొనసాగించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్.శ్రీలత అన్నారు. మండలంలోని ఆరుట్ల, మంచాల గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద పని చేసే ప్రతి ఒక్కరికీ దినసరి కూలి రూ.272 వచ్చే విధంగా పనులు చేయించాలన్నారు. నర్సరీల్లో ప్రజలకు అవసరమైన మొక్కలు పెంచాలన్నారు. ఎండలకు మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తొలకరి వర్షాలు కురిసే నాటికి మొక్కలు నాటేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాల శంకర్, ఏపీడీ సక్రియా నాయక్, ఎంపీఓ వీరాంజనేయులు, పీఓ సంధ్య, టీఏలు శేఖర్, మహేశ్, ప్రభాకర్, స్వామి, కోటేశ్వర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.